# సాక్షి చిత్తూరు

గురువారం । 4 । సెప్టెంబర్ । 2025






**కలంపై కక్ష!**

సాక్షి ఎడిటర్‌పై అక్రమంగా కేసు పెట్టడంపై జర్నలిస్టులు మండిపడ్డారు. పోలీస్‌స్టేషన్ ముందు నిరసన తెలిపారు. - 8లో



**ఎరువుల అక్రమ నిల్వపై నిఘా**

జిల్లాలో ఎరువులు అక్రమంగా నిల్వ చేయకుండా పకడ్బందీ నిఘా పెట్టినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. - 8లో



**శ్రీవారి దర్శనానికి 8 గంటలు**

తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. సర్వదర్శనం టోకెన్లు లేని వారికి 8 గంటల్లో దర్శనమవుతోంది. - 8లో

## న్యూస్‌రీల్

### 30లోపు ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తులు

**చిత్తూరు కలెక్టరేట్ :** నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ వరలక్ష్మి తెలిపారు. బుధవారం ఈ మేరు డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు ఆధార్‌కార్డ్‌లో ఉన్న విధంగానే పేరు, పుట్టిన తేదీ, తండ్రిపేరు నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, నగరపాలక, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లోని 8 వ తరగతి విద్యార్థులు దరఖాస్తుకు అర్హులని వెల్లడించారు. కుటుంబ సంవత్సర ఆదాయం రూ.3.50 లక్షలలోపు ఉండాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు సర్టిఫికెట్‌లు అవసరం లేదని, పరీక్ష రాసే సమయానికి అన్ని ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ పిల్లలు రూ.50 పరీక్ష రుసుమును ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇచ్చే ఎస్‌బీఐ కలెక్ట్ లింక్‌లో మాత్రమే చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు www.bre.ap.gov.in వెబ్‌సైట్ లేదా డీఈఓ కార్యాలయంలోని పరీక్షల విభాగంలో సంప్రదించాలని కోరారు.

### ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈగా ప్రసన్నకుమార్



**చిత్తూరు కార్పొరేషన్ :** జిల్లా గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) శాఖ ఎస్‌ఈగా ప్రసన్నకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా రాజంపేట ఈఈ పనిచేస్తున్న ప్రసన్నకుమార్ ఉద్యోగోన్నతిపై ఎస్‌ఈగా బదిలీపై చిత్తూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు కృషి చేస్తానన్నారు. అనంతరం మర్యాదపూర్వకంగా కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిశారు.

### విద్యుత్ గ్రీవెన్స్‌కు 3 వినతులు



సమస్య తెలుసుకుంటున్న ఈఈ మునిచంద్ర

**చిత్తూరు కార్పొరేషన్ :** చిత్తూరులోని అర్బన్ డివిజన్ ట్రాన్స్‌కో కార్యాలయంలో బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ నిర్వహించారు. పలు ప్రాంతాల వినియోగదారులు మూడు వినతులు అందించారు. వాటిని సకాలంలో పరిష్కారించాలని ఈఈ మునిచంద్ర ఆదేశించారు.

### ప్రత్యామ్నాయ పండ్ల తోటలపై శిక్షణ



మాట్లాడుతున్న శాస్త్రవేత్త సుధాకర్

**గుడిపాల :** మామిడికి ప్రత్యామ్నాయంగా సాగు చేయాల్సిన పండ్ల తోటలపై రైతులకు అవగాహన అవసరమని తిరుపతి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సుధాకర్ తెలిపారు. బుధవారం నంగమంగళంలో ప్రత్యామ్నాయ పండ్ల తోటల సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మామిడికి బదులుగా సపోట, అల్లనేరేడు, నిమ్మ తదితర పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మామిడి వైపే మొగ్గుచూపడంతో గిట్టుబాటు ధర దక్కడం లేదని వెల్లడించారు. ప్రస్తుతం మార్కెట్‌లో అల్లనేరేడుకు మంచి గిరాకీ ఉందని తెలిపారు. అలాగే కొబ్బరితోటల పెంపకంతో కూడా అధిక లాభాలు ఆర్జించవచ్చని వివరించారు. సర్పంచ్ జయకోడి, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, వ్యవసాయాధికారి సంగీత పాల్గొన్నారు.

### నగదు వసూలు చేస్తే చర్యలు

**చౌడేపల్లె :** రైతుల నుంచి విద్యుత్ లైన్‌మన్‌లు నగదు వసూలు చేస్తే సహించే ప్రసక్తే లేదని ట్రాన్స్‌కో శశిధర్ హెచ్చరించారు. బుధవారం సాక్షిలో 'ఎగ్ ఫీజ్ వేయాలంటే రూ.300 ఇవ్వాల్సిందే' శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. బోర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు చేసి రైతులను డబ్బులను అడిగితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

సాక్షి ఎఫెక్ట్..

### ఆరు బార్లకు రీనోటిఫికేషన్

**చిత్తూరు అర్బన్:** జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో మద్యం బార్లు ఏర్పాటు చేసుకునేందుకు అధికారులు రీనోటిఫికేషన్‌ను బుధవారం జారీ చేశారు. చిత్తూరు నగరంలో 5, పలమనేరులో ఒక బార్ ఏర్పాటుకు ఈనెల 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. రూ.5.10 లక్షల నాన్ రీఫండబుల్ రుసుమును చెల్లించి ఆన్‌లైన్ / ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 15వ తేదీన ఉదయం 8 గంటలకు లాటరీ విధానంలో ఎంపిక చేస్తామని, మూడేళ్ల కాలపరిమితితో లైసెన్సులు జారీ చేస్తామని వివరించారు.

# రమణీయం..రథోత్సవం





కాణిపాకంలో వరసిద్ధి వినాయకస్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం రమణీయంగా రథోత్సవం చేపట్టారు. సిద్ధి..బుద్ధి సమేతంగా స్వామివారిని రథంపై కొలువుదీర్చారు. కళాకారులు నృత్యప్రదర్శనలు.. కోలాటాలు.. మంగళవాయిద్యాల నడుమ మహోత్సవానికి శ్రీకారం చుట్టారు. అశేష భక్తజనులు హాజరై గణనాథుని రథంపై మిరియాలు చల్లుతూ మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా పండ్ల పరిశ్రమ సంఘం.. ఆల్ ఇండియా ఫుడ్ ప్రాసెసింగ్ అసోసియేషన్ వారు అందించిన మామిడి జ్యూస్‌ను భక్తులకు పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులు పకడ్బందీ బందోబస్తు చేపట్టారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం తిరు కల్యాణం.. రాత్రి అశ్వవాహన సేవ నిర్వహించనున్నట్లు ఈఓ పెంచలకిషోర్ తెలిపారు.

\- కాణిపాకం

# విత్తు..చిత్తు!

కూటమి నేతల అవినీతికి వేరుశనగ విత్తనం మొలకెత్తకుండానే చిత్తయ్యింది. పొలాలకు చేరకుండానే పక్కదారి పట్టింది. పచ్చమూక కాసుల కక్కుర్తికి రైతాంగం కుదేలైంది. అరకొరగా కాయలు అందడంతో సాగుబడి దారుణంగా పడిపోయింది. ప్రభుత్వ నిర్లక్ష్యంతో అన్నదాతకు దిక్కుతోచని దుస్థితి దాపురించింది. అయితే అధికార యంత్రాంగం మాత్రం వాస్తవాలను కప్పిపుచ్చేందుకు కుంటి సాకులు చెబుతోంది. వరుణుడిపై నెపం నెట్టేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే అధికార పార్టీ నాయకుల అక్రమార్జనకు సహకారం అందిస్తోంది. ఆరుగాలం కష్టించే రైతన్నను నిలువునా మోసం చేస్తోంది.

జిల్లాకు చేరిన వేరుశనగ విత్తనాలు (ఫైల్)





**జిల్లాలో తగ్గిన వేరుశనగ సాగు**

- కేవలం 3వేల హెక్టార్లకే పరిమితం
- సకాలంలో అందని విత్తనకాయలు
- కూటమి నేతల పెత్తనంతో రైతన్న కుదేలు
- అన్నదాతలకు చేరింది 6వేల క్వింటాళ్లు
- దారి మళ్లింది 24వేల క్వింటాళ్లు
- అధికారుల తీరుపై వెల్లువెత్తిన విమర్శలు

**కాణిపాకం :** ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వేరుశనగ సాగు పూర్తిగా పడిపోయింది. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా సాధారణ సాగు విస్తీర్ణం 80వేల హెక్టార్లు అయితే వేరుశనగ పంట విస్తీర్ణం 35,238 హెక్టార్లుగా అధికారులు లెక్క కట్టారు. అయితే ప్రస్తుతం కేవలం 3,652 హెక్టార్లల్లో మాత్రమే వేరుశనగ సాగులోకి వచ్చింది. ఇందుకు ప్రధానంగా ప్రభుత్వ తప్పిదాలతో పాటు.. క్షేత్రస్థాయిలో కూటమి నేతల పెత్తనం, అధికారుల పనితీరులో లోటుపాట్లే కారణమవుతోంది. సకాలంలో అన్నదాత సుఖీభవ నగదు జమ చేయకపోవడంతో రైతులు పెట్టుబడి ఖర్చులు భరించలేని పరిస్థితి ఏర్పడింది. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే పెట్టుబడి సాయం (రైతు భరోసా) అందించేది. విత్తనకాయలు సైతం అవసరాలకు అనుగుణంగా సరఫరా చేసేది. ప్రస్తుత సర్కారు ఈ విషయంలో అలసత్వం వహించడంతో వేరుశనగ రైతులకు అవస్థలు తప్పలేదు.

**ఇష్టారాజ్యంగా పంపిణీ**

ఈ ఏడాది రాయితీ వేరుశనగ విత్తనాలు రైతు సేవా కేంద్రాలు, సొసైటీ, పంచాయతీ భవనాలకు చేరేలోపు.. కూటమి నేతలు చేజిక్కించుకున్నారు. విత్తనాల కొనుగోలు టోకెన్లను కైవసం చేసుకున్నారు. కాయల పంపిణీపై పెత్తనం మొదలుపెట్టారు. ఇష్టారాజ్యంగా విత్తనాలను పంచిపెట్టారు. దీంతో నిజమైన రైతులకు మాత్రం సక్రంగా కాయలు అందలేదు. ఈ క్రమంలో వేరుశనగ విత్తనం పూర్తి స్థాయిలో పొలాలకు చేరని పరిస్థితి ఏర్పడింది.

**తోడైన తోతాపురి కష్టాలు!**

వేరుశనగ విత్తనాలు పంపిణీ చేసే సమయానికి అధిక సంఖ్యలో రైతులు తోతాపురి మామిడి ధరలతో కుస్తీపడుతున్నారు. గుజ్జు ఫ్యాక్టరీల వద్ద రాత్రింబవళ్లు పడిగాపులు కాస్తున్నారు. దాదాపు నెలపాటు ఈ అవస్థలతో రోడ్డు మీద పడిపోయారు. దీంతో వేరుశనగ విత్తనాల కొనుగోలుకు దూరమయ్యారు. ఇదే అదునుగా కూటమి నేతలు రాయితీ విత్తనాలను యథేచ్ఛగా స్వాహా చేసేశారు.

**24వేల క్వింటాళ్లు హాంఫట్..?**

ప్రభుత్వం సరఫరా చేసిన కాయలకు.. జిల్లాలో వేరుశనగ విత్తుకు పొంతన కుదరని పరిస్థితి. జిల్లాకు వచ్చిన 30,283 క్వింటాళ్ల కాయలను దాదాపు 20వేల హెక్టార్లలో విత్తుకోవచ్చు. అయితే అందులో నాలుగో వంతు గింజలు కూడా భూమిలో పడలేదు. కేవలం 3,652 హెక్టార్లలో మాత్రమే వేరుశనగ సాగులోకి వచ్చింది. ఈ లెక్కన హెక్టారుకు 1.5 క్వింటాళ్ల కాయలను విత్తితే సుమారు 6వేల క్వింటాళ్లు మాత్రమే సరిపతాయి. మిగిలిన దాదాపు 24వేల క్వింటాళ్లు ఏమయ్యాయో వ్యవసాయశాఖ అధికారులే చెప్పాల్సి ఉంది. వేల క్వింటాళ్లను కూటమి నేతల పరం చేశారా..? లేకుంటే వంట నూనెకు వాడేశారా..? ఇంతకీ కాయలు తీసుకున్న వారందరూ రైతులేనా..? నిజంగా రైతులకే విత్తనాలు ఇచ్చుంటే.. వేరుశనగ సాగు విస్తీర్ణం ఈ స్థాయిలో ఎందుకు పడిపోయిందో లెక్కలు చెప్పాల్సిన అవసరముంది. పైగా వేరుశనగ కాయలు విక్రయించిన నగదును ప్రభుత్వానికి జమ చేయకుండా తొలుత రూ.కోటి వరకు బకాయి ఎందుకు పెట్టారో వెల్లడించాల్సి ఉంది. ఇప్పటికీ అందులో రూ.25లక్షల వరకు బకాయిలు ఉన్నట్లు రైతుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అరకొరగా కాయలు**

ప్రభుత్వం జిల్లాకు అరకొరగా విత్తన కాయలు సరఫరా చేసింది. తొలుత 26,350 క్వింటాళ్లు మాత్రమే కేటాయించింది. రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో అదనపు కేటాయింపులతో కలిపి మొత్తం 30,283 క్వింటాళ్లు సరఫరా చేసింది. ఈ క్రమంలో రైతులకు ఒక్కో బ్యాగు చొప్పున విత్తన కాయలు అందించేందుకు వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇదే సమయంలో కూటమి నేతలు రంగంలోకి దిగారు. అధికారులతో కుమ్మక్కై ప్రణాళికలను తారుమారు చేసేశారు.



వేరుశనగ పంట

**జిల్లా సమాచారం**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో.. విత్తనాల సరఫరా

| సంవత్సరం | క్వింటాళ్లు |
|---|---|
| 2022 | 42.288 |
| 2023 | 41.070.3 |
| 2024 | 42.202.5 |
| కూటమి సర్కారులో.. | |
| 2025 | 30.283 |

**వర్షపాతం వివరాలు**

| నెల | సాధారణం మి.మీలో | కురిసింది మి.మీలో |
|---|---|---|
| జూన్ | 80.09 | 38.7 |
| జూలై | 103.05 | 96.04 |
| ఆగస్ట్ | 121.02 | 242.2 |

**కుంటి సాకులు**

వేరుశనగ విత్తుకునేందుకు సకాలంలో వర్షాలు కురవలేదని, అందువల్లే సాగుబడి తగ్గిపోయిందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే దీనిపై రైతులు మండిపడుతున్నారు. అదును తగినట్టు వర్షాలు పడ్డాయని, ప్రభుత్వం, కూటమి నేతలు, అధికారుల నిర్వాకం కారణంగా వేరుశనగ సాగు పడిపోయిందని ఆరోపిస్తున్నారు. చేసిందంతా చేసేసి ఇప్పుడు కుంటిసాకులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సకాలంలో పెట్టుబడిసాయం, రాయితీ విత్తనాలు అందేవని, ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదని వాపోతున్నారు.

# అధికారుల అలసత్వంపై అసంతృప్తి

- బాధ్యతగా విధులు నిర్వర్తించాలి
- కలెక్టర్ సుమిత్‌కుమార్

**చిత్తూరు కార్పొరేషన్ :** జిల్లావ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో సాగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి అధికారుల తీరుపై కలెక్టర్ సుమిత్‌కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం జెడ్పీ సమావేశ మందిరంలో ఎంపీడీఓలు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షించారు. పల్లెల్లో చేపట్టిన పనులపై అలసత్వం ఎందుకని ప్రశ్నించారు. ఎంపీడీఓలు బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశబూరు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను ఎప్పటికప్పుడు ఆయా సర్పంచులతో చర్చించి ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, కిచెన్ షెడ్లు, ఆర్‌ఓ పాంట్లు, సీసీ రోడ్లు, ఇతర నిర్మాణ పనుల పురోగతిపై ఆరా తీశారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పీఆర్‌లో 23 పనులు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 119 పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్సీ ఎస్టీ కాలనీల్లో సురక్షితమైన తాగునీరు సరఫరా చేయాలని కోరారు. ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామ యోజన పథకానికి జిల్లాలో 16 మండలాలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. 50 శాతం ఎస్సీ జనాభా ఉన్న గ్రామాల్లో అభివృద్ధి పనులకు కేంద్రం నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. అందులో భాగంగా ఇప్పటి వరకు మొత్తం రూ. 3.05 కోట్లతో 89 పనులు పూర్తి చేశామని వివరించారు. తాగునీటికి సంబంధించి మొత్తం 626 పనులకు గాను 338 పూర్తయినట్లు చెప్పారు. పీఆర్‌కు సంబంధించి మొత్తం 438 పనులకు గాను రూ. 26.22 కోట్లు అంచనా వ్యయంతో 216 పూర్తి చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో డీఆర్‌ఓ మోహన్‌కుమార్, జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు, డిప్యూటీ సీఈఓ వెంకటనారయణ, పీఆర్ ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

# ప్రజా నాయకుడు పెద్దిరెడ్డి

- ఎంపీ మిథున్‌రెడ్డిపై తప్పుడు కేసులు తొలగించాలి
- కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలి
- ప్రత్యేక పూజలు నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నేతలు



నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీనేతలు

**చౌడేపల్లె :** పేదల సంక్షేమం కోసం పరితపించే ప్రజా నాయకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అని, ఆయన కుటుంబంపై కక్షసాధింపులకు దిగుతున్న కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని వైఎస్సార్‌సీపీ నేతలు కోరారు. బుధవారం ఈ మేరకు చారాల సమీపంలోని అన్నపూర్ణాంబ సమేత కాశీవిశ్వేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీ మిథున్‌రెడ్డిపై పెట్టిన తప్పుడు కేసులను వెంటనే తొలగించాలని కోరారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్. దామోదరరాజు, మండల అధ్యక్షుడు జి. నాగభూషణరెడ్డి, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్,మాజీ ఎంపీపీలు రుక్మిణమ్మ, అంజిబాబు మాట్లాడుతూ పెద్దిరెడ్డిని టార్గెట్ చేసి అక్రమ కేసులు పెట్టడంతోపాటు ఎల్లో మీడియా ద్వారా కూటమి ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల అండతో వైఎస్సార్‌సీపీనేతలపై దాడులు, దౌర్జన్యాలకు తెగబడుతోందని ఆరోపించారు. నేతలను అన్యాయంగా జైలు పాలు చేస్తోందని మండిపడ్డారు. కుట్రలు వదిలేసి ప్రజా సంక్షేమంపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రస్తుతం రైతులు యూరియా కోసం నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సకాలంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందేవని గుర్తుచేశారు. సూపర్‌సిక్స్ పథకాలను అరకొరగా అమలు చేస్తూ గొప్పలు చెప్పుకోవడం తప్ప కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రజలకు చేసింది శూన్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం నేర్పుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆడెం హరిబాబు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు వెంకటరమణ, నేతలు లడ్డూ రమణ, అమర, రమణారెడ్డి, ,శివశంకర్‌రెడ్డి ,మునిరాజా ,ప్రమోద్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, వీరప్పాచారి, సుబ్రమణ్యం, రామచంద్ర, రవికుమార్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ రవిచంద్రారెడ్డి, విద్యార్థి విభాగం కార్యదర్శి కల్యాణ్‌భరత్, కో–ఆప్షన్ మెంబర్ సాధిక్, బోయకొండ మాజీ డైరెక్టర్ నాగరాజా, డీసీసీబీ మాజీ డైరెక్టర్ రమేష్‌బాబు, యశోద, అనుప్రియ పాల్గొన్నారు.

# అన్నదాతలకు అండగా..



సమావేశంలో పెద్దిరెడ్డి, భూమన, నారాయణస్వామి, రోజా, రెడ్డెప్ప తదితరులు

- వైఎస్సార్‌సీపీ పోరుబాట
- పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని..
- మామిడి బకాయిల విడుదల కోసం..
- ఈనెల 9న ఆర్డీఓ కార్యాలయాల వద్ద నిరసనలు

**సాక్షి ప్రతినిధి, తిరుపతి :** అన్నదాతలకు అండగా వైఎస్సార్‌సీపీ పోరుబాటకు సిద్ధమైంది. కూటమి ప్రభుత్వంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయాలని నిర్ణయించింది. అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 9న తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని ఆర్డీఓ కార్యాలయాల వద్ద నిరసన చేపట్టనుంది. ఆ మేరకు బుధవారం తిరుపతిలోని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నివాసంలో పార్టీ తిరుపతి, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, మాజీ మంత్రులు నారాయణ స్వామి, ఆర్‌కే రోజా, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎంపీ రెడ్డప్ప, తిరుపతి నగర మేయర్ శిరీష, సమన్వయకర్తలు బియ్యపు మధుసూదన్ రెడ్డి, భూమన అభినయరెడ్డి, డాక్టర్ సునీల్‌కుమార్, వెంకటేగౌడ్, నూకతోటి రాజేష్, కృపాలక్ష్మి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు చంద్రమౌళిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బీరేంద్రవర్మ, తిరుపతి అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి సమావేశమయ్యారు. రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చించారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు మామిడి దిగుబడులకు గుజ్జు పరిశ్రమల వారు కిలో మామిడికి రూ.8, ప్రభుత్వం రూ.4 చెల్లించాల్సి ఉంది. కాయలు విక్రయించి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు పైసా చెల్లించకపోవడంపై మండిపడ్డారు. ధాన్యానికి గిట్టుబాటు ధర లేకపోవటం, యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాలపై చర్చించారు. రైతు సమస్యల పరిష్కారం ఈనెల 9న ఆర్డీఓ కార్యాలయాల వద్ద రైతులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు. పలమనేరులో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వెంకటేగౌడ్, శ్రీకాళహస్తిలో భూమన కరుణాకర రెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, నగరిలో ఆర్‌కే రోజా, కృపాలక్ష్మి, చిత్తూరులో నారాయణస్వామి, డాక్టర్ సునీల్‌కుమార్, కుప్పంలో రెడ్డప్ప, ఎమ్మెల్సీ భరత్, తిరుపతిలో భూమన అభినయరెడ్డి, చంద్రగిరి సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు కార్యాచరణ అమలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

## బాలికపై లైంగిక దాడికి యత్నం

– యువకుడిపై పోక్సో కేసు నమోదు

**వెదురుకుప్పం:** మండలంలో బాలికపై లైంగిక దాడికి యత్నించిన ఓ యువకుడిపై బుధవారం పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య కథనం మేరకు.. వెదురుకుప్పం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(11) వెదురుకుప్పం జెడ్పీ హైస్కూల్‌లో ఆరో తరగతి చదువుతోంది. బుధవారం ఉదయం పాఠశాలకు బయలుదేరే క్రమంలో అదే గ్రామానికి చెందిన హరిప్రసాద్(40) పాఠశాల వద్ద విడిచిపెడతానని చెప్పి వాహనంలో ఎక్కించుకుని మార్గం మధ్యలోని కమ్మకండ్రిగ సమీపంలో ఉన్న మామిడి తోటకు తీసుకెళ్లాడు. అక్కడ బలవంతంగా బాలికతో విచక్షణారహితంగా ప్రవర్తించి లైంగికి దాడికి ప్రయత్నించడంతో భయపడి బాలిక కేకలు వేసింది. అరిస్తే చంపేస్తామంటూ బెదిరించి పాఠశాలకు పంపించేశాడు. పాఠశాలలో ఏడుస్తున్న బాలికను గమనించిన ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. తల్లిదండ్రులు జరిగిన ఘటనను తెలుసుకుని వెదురుకుప్పం పోలీసులకు వివరించారు. నగరి నుంచి వచ్చిన మహిళా ఎస్‌ఐ, సిబ్బంది విచారించారు. తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడు ప్రసాద్‌ను పోలీసులు అరెస్టు చేసి పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా నిందితుడిపై పలు దొంగతనం కేసులు కూడా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

## ఉత్తమ అవార్డులకు ముగ్గురు ఉపాధ్యాయులు

**చిత్తూరు కలెక్టరేట్ :** ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ముగ్గురు టీచర్లు ఎంపికైనట్లు బుధవారం రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలోని పుంగనూరు మండలానికి చెందిన సి.హేమలత (మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్, రామ్‌నగర్), నౌజియా (కేజీబీవీ, నక్కబండ, ఎస్‌ఏ ఉర్దూ), గుడిపాల మండలానికి చెందిన ఎస్. నౌషద్ అలీ ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 5వ తేదీన విజయవాడలో నిర్వహించే గురుపూజోత్సవంలో అవార్డులు ప్రదానం చేయనున్నారు. అవార్డుకు ఎంపికై న ఉపాధ్యాయులకు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, డీఈఓ వరలక్ష్మి, ఏపీసీ వెంకటరమణ అభినందనలు తెలిపారు.

## ఎస్‌ఐపై బదిలీ వేటు

**చిత్తూరు అర్బన్:** చిత్తూరు వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీనివాస్‌పై బదిలీ వేటుపడింది. ఆయనను చిత్తూరులోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రానికి బదిలీ చేస్తూ ఎస్పీ మణికంఠ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీఐ, కొందరు సిబ్బంది కలిసి ఓ దొంగ నుంచి చోరీ సొత్తులో రూ.లక్షల్లో లంచాలు తీసుకున్నట్లు విమర్శలు వెల్లువెత్తాయి. ఈ ఘటనలో సీఐని మాత్రం బదిలీ చేసిన అధికారులు మిగిలిన వారిని వదిలేశారు. తాజాగా స్టేషన్‌లో హోంగార్డును సొంత పనులకు వాడుకున్నట్లు ఎస్‌ఐపై మరో మారు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనలో హోంగార్డును వ్యక్తిగత పనులకు కేటాయించిన హెడ్ కానిస్టేబుల్‌ను వీఆర్‌కు బదిలీ చేశారు. అలాగే ఎస్‌ఐపై కూడా బదిలీ వేటు వేశారు.

**మరో ముగ్గురికి సాధారణంగానే..**

**చిత్తూరు అర్బన్:** వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీనివాసులుతో పాటు మరో ముగ్గురు ఎస్‌ఐలను బదిలీచేస్తూ ఎస్పీ మణికంఠ ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న ముగ్గురిలో నాగప్ప నాయక్‌ను చిత్తూరు వన్‌టౌన్ స్టేషన్‌కు, యూసఫ్‌ను పలమనేరుకు, త్యాగరాజులును చిత్తూరు ట్రాఫిక్‌కు బదిలీచేస్తున్నట్లు ఎస్పీ ఉత్తర్వులో పేర్కొన్నారు.

# కలంపై కక్ష!

- వార్తలు రాస్తే కేసులా?
- పోలీసులకు జరిగిన అన్యాయాన్ని ప్రచురిస్తే నిర్బంధమా?
- పోలీసుల చేత అర్ధరాత్రి విచారణ
- తిరుపతి పోలీస్ స్టేషన్‌లో పాత్రికేయుల నిరసన
- సాక్షి ఎడిటర్‌పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్

**తిరుపతి అర్బన్ :** ఇదేమి రాజ్యం చంద్రబాబూ.. పత్రికల్లో వార్తలు ప్రచురిస్తే కేసులు పెట్టి... జర్నలిస్టులను భయపెట్టడం ఎంటీ సార్..రాష్ట్ర చరిత్రలో ఓ వార్త ప్రచురించారని ఏకంగా ఎడిటర్‌పై కేసు పెట్టడం ఇప్పటి వరకు జరగలేదు బాబు అంటూ తిరుపతి పాత్రికేయులు కూటమి సర్కారు వ్యవహారంపై తీవ్రమైన అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం పోలీస్ విభాగానికి సంబంధించి డీఎస్పీల పదోన్నతి అంశంలో జరుగుతున్న లోటుపాట్లతో పోలీస్ అధికారులకు జరుగుతున్న అన్యాయాన్ని సాక్షి పత్రికలో ఓ కథనం ప్రచురిస్తే...అదే పోలీస్‌లతో అర్ధరాత్రి సమయంలో విచారణ చేపట్టడంతో పాటు ఏకంగా సాక్షి ఎడిటర్ ఆర్. ధనంజయరెడ్డితో పాటు క్రైమ్ బ్యూరో ఇన్‌చార్జిపై కేసులు పెట్టడంపై జర్నలిస్ట్ సంఘాలు మండిపడ్డాయి. ఆ మేరకు బుధవారం తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్ వద్ద పలు పాత్రికేయుల సంఘాల ప్రతినిధులు అక్రమ కేసులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల వృత్తి సమాజంలో జరుగుతున్న మంచితోపాటు చెడును తెలియజేయడం ద్వారా అధికార యంత్రాంగం తప్పులను సరిదిద్దుకునే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో పత్రికలు పనిచేస్తున్నాయని సంఘాల నేతలు కూటమి సర్కారుకు గుర్తు చేశారు. అయితే ప్రభుత్వ ఆలోచన మాత్రం దురుద్దేశపూర్వకంగా ఉందని విమర్శించారు. తప్పిదాలు చోటు చేసుకున్నా, అవినీతి అక్రమాలు కొనసాగుతున్న వాటిని ప్రజలకు తెలియజేయకుండా... తప్పులతో సంబంధం లేకుండా ప్రభుత్వానికి భజన చేయాలని భావించడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. మీడియాపై కక్ష సాధింపులకు పాల్పడిన ఏ ప్రభుత్వానికి మనుగడ లేకుండా పోయిందని హెచ్చరించారు. సాక్షి ఎడిటర్‌పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున పోరాటాలు చేయాల్సి వస్తుందని స్పష్టం చేశారు. అనంతరం ఈస్ట్ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీనివాసులకు అక్రమ కేసుల అంశాన్ని వివరించారు. పోలీసులకు మద్దతుగా కథనాలు రాస్తే.... అదే పోలీసును ఎడిటర్‌పై కేసులు పెట్టడం న్యాయమా అని ప్రశ్నించారు. ఆ మేరకు ఓ వినతిపత్రాన్ని ఆయనకు అందించారు. ఈ కార్యక్రమంలో సాక్షి పత్రిక బృందంతో పాటు తిరుపతి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఆర్.మురళి, కార్యదర్శి పి.బాలచంద్ర, ఏపీ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.గిరిబాబు, ఏపీ మీడియా ఫెడరేషన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ కల్లుపల్లి సురేంద్రరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే కార్యవర్గ సభ్యుడు మబ్బు నారాయణరెడ్డి, జర్నలిస్ట్ సంఘం నేతలు హేమంత్, ప్రసాద్ మోహన్, సుబ్రమణ్యం, చంద్రాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సాక్షి ఎడిటర్‌పై పెట్టిన అక్రమ కేసుల నేపథ్యంలో ఈస్ట్‌పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసులకు వినతిపత్రాన్ని ఇస్తున్న తిరుపతి జర్నలిస్టులు


తవణంపల్లె ఎస్‌ఐ చిరంజీవికి వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

### అక్రమ కేసులు అమానుషం

– పత్రికా స్వేచ్ఛను హరిస్తే సహించం

**తవణంపల్లె :** ప్రజల పక్షాన నిలుస్తూ.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ.. వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చే పాత్రికేయులపై అక్రమ కేసులు బనాయించడం అమానుషమని, పత్రికా స్వేచ్ఛను హరిస్తే స హించే ప్రసక్తే లేదని జర్నలిస్టులు మండిపడ్డారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై అక్రమంగా కేసు నమోదు చేయడంపై బుధవారం ఏపీయూడబ్ల్యూజే నేతలు నిరసన తెలిపారు. ఎస్‌ఐ చిరంజీవికి వినతిపత్రం అందించారు. తవణంపల్లె ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు జగన్నాథం మాట్లాడుతూ జర్నలిస్టులపై కేసులు పెట్టడం సమజ సం కాదని కోర్టులు స్పష్టం చేసినప్పటికీ కూటమి ప్ర భుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. పత్రికల్లో వచ్చిన వార్తను పరిశీలించి, తప్పులు సరిదిద్దుకునేందుకు యత్నించకుండా కేసు లు నమోదు చేయడం సరికాదని స్పష్టం చేశారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై పెట్టిన కేసును వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిత్తూరు ప్రెస్‌క్లబ్ సభ్యుడు బాలసుందరం, తవణంపల్లె ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు మురుగ, ప్రధాన కార్యదర్శి అనంతకుమార్, కార్యదర్శి రామకుమార్, సభ్యులు గజేంద్ర, సీనియర్ రిపోర్టర్ రమేష్ (నాని) పాల్గొన్నారు.

## 11న వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం సమావేశం

**తిరుపతి మంగళం :** వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 11న తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ ఎస్సీ విభాగం ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ ఎస్సీ విభాగం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు తలారి రాజేంద్ర, ప్రధాన కార్యదర్శి మల్లారపు వాసు తెలిపారు. ఈ మేరకు బుధవారం తిరుపతి మారుతీనగర్‌లోని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నివాసం వద్ద పార్టీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, మాజీ మంత్రి ఆర్‌కె. రోజా, మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎంపీ రెడ్డప్ప, మాజీ ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వెంకటేగౌడ్, డాక్టర్ సునీల్, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, నూకతోటి రాజేష్, కృపాలక్ష్మి, మేయర్ డాక్టర్ శిరీషను కలిసి ఆహ్వానించారు. ఈ సమావేశానికి పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు టిజెఆర్. సుధాకర్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు పాల్గొంటారని రాజేంద్ర తెలిపారు. సమావేశానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఎస్సీ విభాగం నాయకులు తరలిరావాలని కోరారు.


జిల్లా ఎస్సీ విభాగం సమావేశానికి పెద్దిరెడ్డి, రామచంద్రారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, ఆర్‌కె. రోజాలతో పాటు సమన్వయకర్తలను ఆహ్వానిస్తున్న తలారి రాజేంద్ర, మల్లారపు వాసు

## బాస్కెట్ బాల్‌లో 'విజయం' సత్తా

**చిత్తూరు కలెక్టరేట్ :** రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో విజయం కళాశాల విద్యార్థులు సత్తా చాటి విజేతలుగా నిలిచినట్లు విద్యాసంస్థ చైర్మన్ తేజోమూర్తి తెలిపారు. బుధవారం ఈ మేరకు గెలుపొందిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమన్నారు. తమ కళాశాల డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థి గురుచరణ్ విశేష ప్రతిభను ప్రదర్శించినట్లు వెల్లడించారు. అనంతరం జట్టుకు అభినందనలు తెలిపారు. అధ్యాపకులు మోహన్‌నాయుడు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న తేజోమూర్తి

## పింఛన్ కోసం వృద్ధురాలి వేడుకోలు

**పాలసముద్రం :** మండలంలోని పాలసముద్రం దళితవాడకు చెందిన మునెమ్మ అనే వృద్ధురాలు పింఛన్ నగదు కోసం ఆవేదన చెందుతోంది. బుధవారం ఈ మేరకు సచివాలయం, ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తోంది. ప్రతి నెలా తనకు వితంతు పింఛన్ వచ్చేదని, ఈ నెల మాత్రం జాబితాలో పేరు లేదని ఆందోళన వ్యక్తం చేస్తోంది. మూడు రోజులుగా తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పింఛన్ ఇప్పించాలని కోరుతోంది. తనకు వేరే జీవనాధారం లేదని, కనికరించాలని వేడుకుంటోంది.


మునెమ్మ

## డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలో అర్హులైన షెడ్యూల్ కులాలకు చెందిన మహిళలు ఉచిత డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విక్రమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ముగ్గురు షెడ్యూల్ కులాల మహిళలకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఆసక్తిగలవారు ఈ నెల 8వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కనీస వయస్సు 20 ఏళ్లని, 40 ఏళ్లు పైబడిన వారు మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సమర్పించాలని కోరారు. హెవీ మోటర్ వెహికల్ ఎల్ఎల్ఆర్‌కు రూ.210, లైసెన్స్‌కు రూ.1,060 మాత్రమే అభ్యర్థి చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్ ఆధ్వర్యంలో డ్రైవింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణపత్రం, ఎల్ఎంవీ లైసెన్స్ జిరాక్స్‌తో కలెక్టరేట్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. వివరాలకు 9959015657, 8074437025 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

## ఇద్దరు టీచర్లపై చర్యలకు కసరత్తు

సాక్షి ఎఫెక్ట్..

**చిత్తూరు కలెక్టరేట్ :** విద్యార్థులతో మద్యం బాటిళ్లు తీయించిన ఇద్దరు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకునేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వివరాలు.. చిత్తూరులోని కాజూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మందుబాబులు కొందరు విచ్చలవిడిగా మద్యం తాగి ఖాళీ బాటిళ్లను ఎక్కడపడితే అక్కడ పడేసి వెళ్లారు. ఆ సీసాలను ఈ నెల 1వ తేదీన పాఠశాల ఉపాధ్యాయులు ఇద్దరు ఆ ఖాళీ సీసాలను పిల్లలతో తీయించి, ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు. ఈ. ఈ ఘటనపై ఈ నెల 2వ తేదీన సరస్వతీ... క్షమించు తల్లీ అనే శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించారు. సమగ్ర విచారణ చేయించి నివేదికలు తెప్పించుకున్నారు. వాటి ఆధారంగా పాఠశాలలోని ఇద్దరు టీచర్లపై చర్యలు తీసుకోనున్నారు.



### కండక్టర్‌పై దాడికి యత్నం

**యాదమరి :** ఆర్టీసీ బస్సు కండక్టర్‌పై కొందరు దాడికి యత్నించారు. వివరాలు.. బుధవారం రాత్రి చిన్నంపల్లెకు చెందిన ఓ విద్యార్థిని చిత్తూరులోని ఎంఎస్సార్ కూడలి వద్ద మాదిరెడ్డిపల్లె వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కింది. బస్సు కిక్కిరిసి ఉండడంతో విద్యార్థినిని లోపలికి వెళ్లమని కండక్టర్ దురుసుగా చెప్పాడు. మనస్థాపం చెందిన యువతి ఈ విషయాన్ని తమ కుటుంబీకులకు ఫోన్ ద్వారా వెల్లడించింది. దీంతో యాదమరి బస్‌స్టాప్ వద్ద వారు బస్సును అడ్డగించి కండక్టర్‌పై దాడికి యత్నించారు. ప్రధానంగా తమ చెల్లెలుకు కండక్టర్ క్షమాపణలు చెబితే గానీ బస్సును కదలనివ్వబోమని యువతి సోదరులు పట్టుబట్టారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని సర్దిచెప్పారు.

### ఎరువుల అక్రమ నిల్వపై నిఘా

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలో ఎరువుల అక్రమ నిల్వలు, తరలింపుపై ప్రత్యేక నిఘా పెట్టామని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. బుధవారం ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వీడియో కాన్ఫరెన్స్‌లో వివరించారు. ఎరువుల కొరత తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఎరువుల విక్రయదారులతో సమావేశం నిర్వహించి ముందస్తు ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. నిరంతర పర్యవేక్షణలో ఎరువుల సరఫరా చేపడుతున్నామన్నారు. ఖరీఫ్ సీజన్‌కు మొత్తం 28,183 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని, ఇందులో 15 వేలు మెట్రిక్ టన్నుల యూరియా కావాల్సి ఉంటుందని వివరించారు. ఇప్పటి వరకు 13,396 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 2,600 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ఈ నెలలో 200 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు వచ్చిందని, మరో 1500 టన్నులు త్వరలో వస్తాయని వెల్లడించారు.

### హత్య కేసులో నిందితుడి అరెస్ట్

**శ్రీరంగరాజ పురం :** ఎస్ఆర్‌పురం మండలం పాతపాళెంలో పూజా(27) అనే యువతిని హత్య చేసిన కేసులో నిందితుడు భాస్కర్‌ను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. నగరి డీఎస్పీ మహ్మద్ అజీజ్ కథనం మేరకు .. ఆగస్టు 17వ తేదీన పూజను సి.భాస్కర్ అనే యువకుడు మాట్లాడేందుకని తీసుకెళ్లి గొంతు నొక్కి చంపేశాడు. అనంతరం చెట్టుకు ఉరి వేసి ఆత్మహత్యకు పాల్పడినట్లు చిత్రించాడు. పూజ బలన్మరణానికి పాల్పడినట్లు కుటుంబీకుల భావించారు. పోలీసులకు సైతం ఫిర్యాదు చేయకుండా పూజకు అంత్యక్రియలు పూర్తి చేశారు. అయితే పూజను భాస్కర్ హత్య చేసినట్లు గ్రామంలో పుకార్లు రావడంతో వారు పెద్దమనుషులను ఆశ్రయించారు. ఈ క్రమంలో గ్రామ పెద్దలు వెంటనే భాస్కర్‌ను పిలిపించి నిలదీశారు. దీంతో తానే పూజను హతమార్చినట్లు భాస్కర్ అంగీకరించి అక్కడ నుంచి పరారయ్యాడు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఎట్టకేలకు భాస్కర్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.


నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

## అధికారమే అండగా ఆక్రమణ

**సాక్షి, టాస్క్‌ఫోర్స్ :** ''ఇది మా ప్రభుత్వం.. ప్రతి ఒక్కరూ మా కింద ఉండాల్సిందే.. తహసీల్దార్ నుంచి వీఆర్‌ఓ వరకు మాకు సలాం కొట్టాల్సిందే'' అంటూ పచ్చమూక రెచ్చిపోతోంది. ఇష్టారాజ్యంగా కబ్జాలకు పాల్పడుతోంది. ప్రశ్నించిన వారిపై దౌర్జన్యాలకు తెగబడుతోంది. ఈ క్రమంలో పలమనేరు నియోజకవర్గం బైరెడ్డిపల్లె మండలం దేవదొడ్డి గ్రామంలో దారిని ఆక్రమించుకుంది. పది మంది రైతులకు పొలానికి వెళ్లేందుకు బాట లేకుండా చేసింది. వివరాలు.. దేవదొడ్డి గ్రామంలో మంగమ్మ పేరిట సర్వేనంబర్ 46/2ఏలో 4.03 ఎకరాల భూమి ఉంది. ఆమె కుటుంబీకులు పశువులు మేపుకుంటూ, వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి పొలానికి సమీపంలో టీడీపీ స్థానిక నేతలు ధనుంజయ, వెంకటేశులు కొంత భూమి కొనుగోలు చేశారు. తర్వాత మంగమ్మ పొలానికి వెళ్లే కాలిబాటను ఆక్రమించుకునేందుకు యత్నించారు. దీనిపై బాధితులు కోర్టును ఆశ్రయించి స్టే ఆర్డర్ పొందారు. ఈ ఉత్తర్వులను తహసీల్దార్‌కు అందజేశారు. అయితే సదరు తహసీల్దార్ ఈ విషయంలో తాము చేసేది ఏమీ లేదని చేతులెత్తేశారు. దీంతో పచ్చమూక మరింత రెచ్చిపోయింది, నేతలతోపాటు అధికారులకు సైతం ముడుపులు చెల్లించామని, తమను ఎవరూ ఏం చేయలేరని చెలరేగిపోయింది. ఈ క్రమంలోనే జేసీబీతో దారిని ఆక్రమించుకుంది. దీంతో బాధితులు వెంటనే కలెక్టర్, ఎస్పీ, ఆర్డీఓ భవానీకి ఫిర్యాదు చేశారు. కోర్టు ఉత్తర్వులను సైతం ఖాతరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యమని కన్నీరుమున్నీరవుతున్నారు.


పొలానికి వెళ్లే బాటను జేసీబీతో పూడ్చేస్తున్న దృశ్యం

## ఒక బెడ్డు.. ముగ్గురు పేషెంట్లు!


పుత్తూరులోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో ఒకే బెడ్‌పై ముగ్గురు పేషెంట్లు

**పుత్తూరు:** పుత్తూరులోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రి పేరుకు 50 పడకల ఆస్పత్రిగా రికార్డుల్లో ఉన్నా, వాస్తవానికి 29 పడకలతోనే సతమతమవుతోంది. ఇక్కడ ప్రతిరోజూ 600 నుంచి 750 వరకు ఓపీ ఉంటుంది. వీరిలో కనీసం 50 నుంచి 60 మంది వరకు అడ్మిట్ అవుతారు. పుత్తూరు చుట్టు పక్కల మండలాలైన నారాయణవనం, పిచ్చాటూరు, కార్వేటినగరం, వడమాలపేట నుంచి కూడా మెరుగైన వైద్యం కోసం ఇక్కడికి రోగులు వస్తుంటారు. వీరికి సరిపడా బెడ్లు లేకపోవడంతో ఒకే బెడ్‌పై ఇద్దరు, ముగ్గురిని పడుకోబెట్టి వైద్యం అందించాల్సిన దుస్థితి నెలకొంది. మంగళవారం కూడా ఒకే బెడ్‌పై ముగ్గురిని పడుకోబెట్టి వైద్యం అందించారు.

## లింగనిర్ధారణ కేసులో మరొకరిపై వేటు?

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** చిత్తూరు నగరంలో పట్టుబడిన అక్రమ లింగనిర్ధారణ కేసులో మరో సిబ్బందిపై వేటు పడే అవకాశమున్నట్లు తెలిసింది. మేలో అక్రమ లింగనిర్ధారణ కేంద్రాన్ని కలెక్టర్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న విషయం విధితమే. ఈకేసులో ఓ ఆశ వర్కర్ పేరు మాత్రమే ఇన్నాళ్లు వెలుగుచూసింది. అయితే తిరుపతి కేంద్రంగా నడిచిన అక్రమ లింగనిర్ధారణ కేంద్రం రెండు నెలలకు క్రితం బట్టబయలైంది. చిత్తూరులో దందా నడిపించిన ముఠా సభ్యుల్లోని కొందరు ఆ కేంద్రం నడిపిస్తూ.. తమిళనాడులోని తిరువణ్ణామలైకు చెందిన ఓ గర్భిణిని తిరుపతికి తీసుకెళ్లి లింగనిర్ధారణ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నిర్ధారణలో ఆడబిడ్డగా తెలుసుకున్న ఆ గర్భిణి అబార్షన్ చేయించుకుంటానని ఇంట్లో గొడవ పడిందని, వారు అంగీకరించకపోవడంతో కుమార్తెతో పాటు ఆత్మహత్యకు పాల్పడినట్లు వివరించారు. తర్వాత పోస్టుమార్టం రిపోర్ట్‌లో కడుపులో ఉంది మగ బిడ్డగా తెలియడంతో బాధిత కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు దీనిపై కలెక్టర్‌తో పాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో ఇటీవల చర్చించారు. ఈకేసులో గుడిపాల మండలానికి చెందిన ఓ అటెండర్ పాత్ర ఉందని గుర్తించి, అతడిని విధుల నుంచి తొలగించేందుకు రంగం సిద్ధమైనట్లు సమాచారం.

## బాలిక మృతిపై ఫిర్యాదు


బాలిక మృతదేహం

**చిత్తూరు అర్బన్:** చిత్తూరు నగరంలో మూడో తరగతి చదువుతున్న పి.నీసావాణి (8) అనే బాలిక బుధవారం మృతి చెందడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూటౌన్ సీఐ నెట్టికంటయ్య కథనం మేరకు.. నగరంలోని గోకులంవీధికి చెందిన ఇందు కుమార్తె నీసావాణి రాములవారి గుడివీధిలోని ఖాజీ మునిసిపల్ పాఠశాలలో చదువుతోంది. ఆగస్టు 21వ తేదీ బాలికను ఆమె తల్లి పాఠశాల నుంచి ఇంటికి తీసుకెళుతుండగా.. తలనొప్పిగా ఉందంటూ నీసావాణి చెప్పడంతో మందుల దుకాణంలో మాత్ర తీసుకుని వేసింది. జ్వరం, తలనొప్పి తగ్గకపోవడంతో ఈనెల 1వ తేదీన చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళితే అత్యవసర విభాగంలో వైద్యులు అడ్మిట్ చేశారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం 9.30 గంటలకు బాలిక మరణించినట్లు వైద్యులు తెలిపారు. తమ కుమార్తె మృతిపై అనుమానం ఉందని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## ఆర్ఎంపీ క్లినిక్‌లపై దాడులు

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** జిల్లాలోని ఆర్ఎంపీ క్లినిక్‌లపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దాడులు చేపట్టారు. బుధవారం కొనసాగిన దాడుల్లో 10 క్లినిక్‌లకు పైగా సీజ్ చేసినట్లు తెలిసింది. మంగళవారం 76 క్లినిక్‌లను తనిఖీ చేయగా... నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న 24 క్లినిక్‌లను సీజ్ చేశారు. అయితే సీజ్ చేసిన క్లినిక్‌ల తాళాలు ఇవ్వాలని అధికారులకు కూటమి నేతలు ఫోన్ చేసి ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఈ పోరు పడలేక బుధవారం చేపట్టిన తనిఖీ వివరాలను కూడా అధికారులు గోప్యంగా ఉంచారు.

## బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

**చిత్తూరు అర్బన్:** చిత్తూరు నగరంలోని హైరోడ్డులో ఆర్టీసీ బస్సు ఢీకొని నాగరాజు (59) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక సత్యనారాయణపురానికి చెందిన నాగరాజు మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై వెళుతుండగా, కాణిపాకం నుంచి చిత్తూరు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. క్షతగాత్రుడిని స్థానికులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతికి తీసుకెళ్లారు. ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆస్పత్రిలో సెక్యూరిటీ ఓవర్ యాక్షన్

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో కొందరు సెక్యూరిటీ సిబ్బంది ఓవర్ యాక్షన్ ఎక్కువైంది. రోగులు, వారి సహాయకులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా సహాయకులను ఆస్పత్రిలోపలికి అనుమతించకుండా దారుణంగా వ్యవహరిస్తున్నారు. బుధవారం ఓ తల్లి తన కుమార్తె వార్డులో మరణించిందని..వెళ్లి చూడాలని బతిమలాడినా కనికరించలేదు. చివరకు ఆ చిన్నారి మృతదేహాన్ని తల్లి చూడకనే పోస్టుమార్టం గదికి తరలించారు. ఇప్పటికైనా ఆస్పత్రి అధికారులు స్పందించి.. సెక్యూరిటీ సిబ్బంది వైఖరిలో మార్పుతీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

## శ్రీవారి దర్శనానికి 8 గంటలు

**తిరుమల :** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 11 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 64,925 మంది స్వామి వారిని దర్శించుకోగా 21,338 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.90 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం అవుతోంది. ఇదిలా ఉంటే సర్వ దర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.